# ఆడ ఆఫీసర్ల అవస్థలు!

"ఆడది వంట ఇంటి కుందేలు", 'స్త్రీ స్వాతంత్ర్య మూర్తి' అనే నానుడుల అర్థాలను మార్చేస్తూ నేటి మహిళా మణులు 'ఇందుకల మందు లేమను సందేహము వలదు' అంటూ అన్ని రంగాలలోనూ రంగప్రవేశం చేసి రాణిస్తున్నారు. అగ్రతాంబూలాన్నందుకుంటున్నారు కూడా! అంతేకాదు! ఒకప్పుడు అసలు ఆడవాళ్లు ఉద్యోగాలంటూ చేస్తే పంతులమ్మగానో, ఆసుపత్రిలో నర్సమ్మగానో లేకపోతే లేడీ డాక్టరుగానో మాత్రమే కనిపించే వారు మనకి.

అటువంటిది ఈ రోజుల్లో ఆడవారు చదవని చదువంటూ లేదు. న్యాయవాద వృత్తి, ఇంజనీరింగ్, ఐ.పి.ఎస్‌ల దగ్గర్నుంచి కేవలం మగాళ్లకే పరిమితం అన్న విద్యలో సయితం వాణిజ్య పరమైన ఎమ్.బి.ఏ, సి.ఏ లలో కూడా ఆడవాళ్ళు అడుగు పెట్టడమే కాకుండా అగ్రస్థానాన్నందుకుంటున్నారు!

అటువంటప్పుడు ఏమిటబ్బా ఆడవాళ్లకి అందులోనూ ప్రత్యేకించి ఆడ ఆఫీసర్లకి అవస్థలు అని అనుకోవచ్చు!" ఉపన్యాసంలా చెప్పుకుపోతున్న అలేఖ్య మాటలని ఆనంద ఆశ్చర్యంగా కథ విన్నట్టుగా వింటోంది 'ఊ చెప్పూ!' అంటూ.

"ఆనందా! మీ కాలేజీలో అందరూ ఆడవాళ్లే కనక సరిపోయింది. ఇంకోరకం గొడవ చెప్తావిను. ఏదైనా మీటింగు జరిగిందనుకో!, అందరితోపాటు కుర్చీలకి ఒక పది కుర్చీలటూ ఇటూ వదిలేసి దూరంగా మగాళ్లంతా ఒకచోట కూర్చుంటారు. పొరపాటున ఈమె వెళ్లి ఆ ఖాళీ వదలకుండా ఎవరిపక్కనైనా కూర్చుంటే వెంటనే ఆయనకీ ఈమెకీ ఏమిటి సంబంధం? ఆయన పక్క కుర్చీలోనే వెళ్ళి కూర్చుంది!" అంటూ లేనిపోని ఆరాలు తీసి ఏవేవో సంబంధాలు ఊహించి ఆనందిస్తారు. ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు ఉన్నచోట ఎలా వుంటుందో కానీ, మరీ ఒక్కరే గనక వుంటే ఆమె ఏం చెయ్యాలో తెలీక అయోమయంలో పడక తప్పదు!

అలేఖ్య చెప్పే మాటలు నమ్మలేనట్టుగా 'నిజంగా అలా చేస్తారా'? అని అడిగింది ఆనంద. "ఏం చెప్పమంటావ్?" ఒకవేళ ఆమె ఆ సంస్థకి అధికారిణి హోదాలో వుంటే వేరే మార్గం లేక ఆమె ముందు వొదిగి వున్నట్టు కనిపించినా తోటి మగ ఆఫీసర్లు బయటమాత్రం ఆ... ఆ సలహాలన్నీ నేనే చెప్పాను. అసలు ఆవిడ నన్నడగందే ఏమీ చెయ్యదు' అని చెప్పుకుంటూ అక్కడికి ఆమెకి ఆఫీసు నడిపించే సామర్థ్యం లేదనో చెప్పుకుంటారు!

నిజంగా ఏ విషయంలోనైనా సలహా సంప్రదింపులకి పిలిస్తే చాలు. అంటే. ఆమె అసమర్థతని ధృవపరుస్తూ తమ పురుషాధిక్యతని చాటుకుంటారు లేదా లేనిపోని పిచ్చి ఊహలతో ఆమెని వాళ్లమీద మోజుందనో ప్రేమించేస్తోందనో కలలు కంటారు. ఇంకా చెప్పాలంటే ఆవిడకి ఎక్కడెక్కడినుంచి ఎవరు ఫోను చేస్తారో, ఆమెతో ఎవరెవరు మాట్లాడుతారో తెలుసుకుని కాస్త సరదాగా మాట్లాడే వారైతే లేనిపోని సంబంధాలని అంటగడతారు'. ఈ విషయం చెబుతున్నప్పుడు అలేఖ్య మొహంలో బాధని గ్రహించిన ఆనంద ఆలోచించడం మొదలు పెట్టింది.

ఒక ఆడా ఒక మొగా స్నేహంగా వుంటే రంకు కట్టే సమాజం, వారి స్నేహాన్ని స్నేహంగా మాత్రమే స్వీకరించలేదు. బయట ఆఫీసరైనా, డాక్టరైనా, లాయరైనా, ఏదైనాసరే భర్తముందు మాత్రం ఆమె అతని ఆజ్ఞలను స్వీకరిస్తూ పాదదాసిలా పడుండే ఇల్లాలే!

అత్తింటి వారి మర్యాదలు చూసుకుంటూ అతిధుల గౌరవాన్ని నిలబెడుతూ ఇంట్లో కేవలం ఇల్లు చూసుకునే ఇల్లాలిగా ప్రవర్తిస్తుండాలి! లేకపోతే తెగించిందనీ, సిగ్గు మాలినదనీ, నానా పేర్లూ పెట్టి ఆక్షేపిస్తారు. అన్నింటికంటే విచారించవలసిన విషయాలేమిటంటే ఆడవాళ్లే ఆడవాళ్లమీద అపనిందలు వెయ్యడం, ఆనందించడం జరుగుతూ వుంటుంది. ఆడవాళ్లలో వుండే ఆ స్వభావమే, మగవాళ్లకి ఆధిక్యతని పెంచుతూ వారి అహానికి ఆజ్యం పోస్తుంది! ఆడవాళ్లు తోటి ఆడవాళ్ల గురించి హేళనగా మాట్లాడడం, చులకనగా చూడడం మానేంతవరకూ ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది.

సృష్టిలో స్త్రీ పురుషుల పాత్ర రెండూ ముఖ్యమైనవేనని, ఇరువురిలో ఏ ఒక్కరు లేకపోయినా సృష్టి జరగదనీ, కనుక ఇందులో హెచ్చు తగ్గుల ప్రసక్తే లేదని ఇద్దరూ సంసారానికిగానీ, ప్రపంచానికిగానీ, రెండు కళ్ళూ, రెండు చేతులూ, రెండు కాళ్లలాంటి వారనీ గుర్తించినప్పుడే ఇటువంటి పరిస్థితి మారుతుందనీ మర్నాడు తాను తీసుకోబోయే తెలుగు క్లాసులో ఈ విషయాలు పిల్లలకి చెప్పాలని ఆలోచిస్తున్న ఆనంద.

"ఏయ్! ఏ లోకంలో వున్నావ్? పద నిన్ను బోర్ కొడుతున్నట్టున్నాను. ఇంక ఈ విషయాలు మానేసి చక్కగా కబుర్లు చెప్పుకుందాం లేదా మంచి సినిమా కెళదాం" అంటూ ఆనందని చెయ్యి పట్టి లేపి డైనింగ్ రూంలో కెళ్లి కాఫీ కప్పునందించింది, తానూ ఒక కప్పునందుకుంటూ అలేఖ్య! *